క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: మైలవరంలో 220 కేవీ కొత్త విద్యుత్ సబ్ స్టేషను నిర్మాణంలో ఉందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ కారణంగా ప్రధాన విద్యుత్ ఫీడర్ల ద్వారా నూజివీడు డివిజన్లోని గ్రామాలకు కరెంటు సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మృతి



తిరువూరు: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వేల్పుల మల్లికార్జునరావు (59) గుండెపోటుతో మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంలో సోమవారం మరణించారు. ఆయన మృతదేహాన్ని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సందర్శించి నివాళులర్పించారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు కూడా మల్లికార్జునరావు కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

వ్యాసరచన పోటీలు



చాట్రాయి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడకం వలన పర్యావరణం దెబ్బతింటుందని, వాటిని అరికట్టేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. మండల స్థాయిలో విజేతలు ఈ నెల 5న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



తిరువూరు: ప్రతిరోజూ వ్యాయామంతో పాటు సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని తిరువూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా తిరువూరు బోస్ సెంటర్ నుంచి లక్ష్మీపురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకోటేశ్వరరావు మాట్లాడుతూ శరీర దృఢత్వానికి, రక్తప్రసరణ సజావుగా జరగడానికి సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం, సాయంత్రం సైక్లింగ్ చేయడంవలన శరీరంలోని మలినాలు త్వరగా శుద్ధి అవుతాయని, వాతావరణ కాలుష్యం నియంత్రించడానికి కూడా సైక్లింగ్ ఎంతో అవసరమన్నారు. అసోసియేషన్ సభ్యులు కిలారు శివరామకృష్ణ, బొల్లినేని రఘురాం, అమిదిపురం శ్రీనివాసరావు, దారా రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం



ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన సహారా రాజు తన తండ్రి రఘుపతిరాజు జ్ఞాపకార్థం రూ.10 వేలను విరాళంగా వైద్యురాలు రజితకు సోమవారం అందజేశారు. దాతను ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కె.చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అకట్టుకుంది. సోమవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలకు కళాబృందంలోని సభ్యులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళా బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

ఉత్కంఠకు నేటితో ముగింపు

కట్టుదిట్టంగా పోలీసు భద్రత



ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళలు (ఫైల్)

తిరువూరు: గత నెల 13న జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు మంగళవారం తెరపడనుంది. తిరువూరు నియోజకవర్గంలో సర్వత్రా నెలకొన్న ఉత్కంఠ వీడనుంది. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల గెలుపు ఓటములపై పెద్ద ఎత్తున పందేలు కాసిన ప్రముఖులు టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎన్టీఆర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి తిరువూరు నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై పందేలు కాసిన వారు ఫలితాలు ఎలా ఉంటాయోనని కంగారు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీపై ధీమా అధికశాతం కనిపిస్తోంది.

భద్రత కట్టుదిట్టం..

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు రాజకీయ పార్టీల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. తిరువూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఇబ్రహీంపట్నం నోవా కాలేజీలో జరగనుంది.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్..

ఈ ఎన్నికల్లో తిరువూరు నియోజకవర్గ పరిధిలో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. గత ఎన్నికల్లో 2 లక్షల 3 వేల 436 మంది ఓటర్లలో లక్షా 76 వేల 453 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో 86.75 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో 2 లక్షల 7 వేల 190 మంది ఓటర్లు ఉండగా, లక్షా 81 వేల 669 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో 90,071 మంది పురుష ఓటర్లు, 91,594 మంది మహిళల ఓట్లు పోలయ్యాయి. మొత్తం 87.68 శాతం ఓట్లు నమోదయ్యాయి. మహిళలు పెద్ద ఎత్తున ఈ ఎన్నికల్లో క్యూలో నిలబడి ఓపికగా ఓటు వేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లు తమకే అనుకూలంగా పడ్డాయని వైఎస్సార్ సీపీ భావిస్తోంది.

నేడు వ్యాపార సంస్థలకు సెలవు..

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసి ఉంచాలని తిరువూరు సర్కిల్ పోలీసులు ప్రకటించారు. 144 సెక్షన్, 30 పోలీసు చట్టం అమలులో ఉండటంతో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించవద్దని, ముగ్గురి కంటే ఎక్కువ మంది గుమికూడ వద్దని తెలియజేశారు.

లెక్కింపు ఏర్పాట్లు పూర్తి..

తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నోవా కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు, సిబ్బంది సన్నాహాలు చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ఏజంట్లను, అభ్యర్థులను ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

భవితవ్యం తేలేది నేడే..

నూజివీడు: ఎన్నికలలో గెలుపుపై అభ్యర్థులతో పాటు ప్రజలలో నెలకొన్న ఉత్కంఠ మరికొన్ని గంటల్లో వీడనుంది. నూజివీడు కోటపై జెండా ఎగురవేసే నాయకుడెవరన్నది తేలనుంది. మే 13న జరిగిన పోలింగ్‌లో ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం నేడు వెల్లడి కానున్న నేపథ్యంలో ఓటరు తీర్పు ఎలా ఉంటుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

బరిలో 10 మంది.. పోటీ ఇద్దరి మధ్యే..

నూజివీడు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కించనున్నారు. ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కొలుసు పార్థసారథి మధ్య నెలకొంది. మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మేకా వెంకట ప్రతాప్ అప్పారావు (వైఎస్సార్ సీపీ), కొలుసు పార్థసారథి (టీడీపీ), మరీదు కృష్ణ (కాంగ్రెస్), చలిగంటి వెంకటేష్ (బీఎస్పీ), సోము వెంకట శివపూర్ణచంద్రరావు (జాతీయ జనసేన పార్టీ), పాము రవీంద్రనాథ్ (రిఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థులుగా కొలుసు కమల లక్ష్మి, బొట్ల వెంకట సత్యనారాయణ, మందలపు శ్రీనివాసరావు, ఆముదాల ఇస్సాకు బరిలో నిలిచారు.

ఎన్నికల్లో పోలైన ఓట్లు..

నియోజకవర్గంలో మొత్తం 2,38,981 ఓట్లు ఉండగా, అందులో 2,10,161 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పురుషుల ఓట్లు 1,05,054 మంది కాగా, మహిళల ఓట్లు 1,05,105 మంది, థర్డ్ జెండర్-2 ఓట్లు పోలవగా, పోలింగ్ శాతం 87.94గా నమోదైంది. 2019 ఎన్నికల కంటే ఈ ఎన్నికలకు 8,331 ఓట్లు పెరిగిన నేపథ్యంలో యువ ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపారనేది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా 2019లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో, పట్టణంలోనూ వైఎస్సార్ సీపీకే మెజారిటీ రావడంతో మొత్తం మీద 16,500 ఓట్ల మెజారిటీ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 30కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేసిన నేపథ్యంలో విజయం అటువైపే ఉంటుందనే భావన వ్యక్తం అవుతోంది.

వైఎస్సార్ సీపీలో జోష్

జాతీయ సంస్థలు, మరికొన్ని రాష్ట్ర సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని స్పష్టంగా పేర్కొనడంతో ఆ పార్టీ వర్గాలు మంచి జోష్‌తో ఉన్నాయి. సర్వేలన్నీ అనుకూలంగా ఉండటంతో విజయంపై మరింత ధీమా పెరిగింది.

తిరుపతయ్య సేవలు అజరామరం



రమణక్కపేటలో ఆముదాల తిరుపతయ్య సంస్మరణ సభ

ముసునూరు: ఆదర్శ కమ్యూనిస్టుగా, ఆముదాల సేవలు అనుసరణీయం అని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. పార్టీ ఏరియా మాజీ కార్యదర్శి, పలు భూపోరాటాల మార్గదర్శి దివంగత ఆముదాల తిరుపతయ్య మూడో వర్ధంతిని స్వగ్రామం రమణక్కపేటలో ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ట్రస్ట్ చైర్మన్ కాంతారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముందుగా ఆముదాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ 70, 80 దశకాల్లో నూజివీడు ప్రాంతంలో అనేక భూపోరాటాలు చేసి, దున్నేవాడిదే భూమి అని 35 వేల ఎకరాల భూములను పేదలకు పంచేందుకు కృషి చేసిన ఘనుడు ఆముదాల అన్నారు. చదువు-చదివించు నినాదంతో గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేశారని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నేత హరనాథ్ కొనియాడారు. నూజివీడు మండలం కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొకినాల కాంతకుమారి, రైతు సంఘ నేతలు వేముల బక్కయ్య, కూచిపూడి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, శ్యామ్ పాల్గొన్నారు.

అకడమిక్ భవన నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎండీ దివాన్‌రెడ్డి, వీసీ జ్ఞానమణి

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్‌లో రూ.6 కోట్లతో నిర్మాణంలో ఉన్న నూతన అకడమిక్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దివాన్‌రెడ్డి, కృష్ణా యూనివర్సిటీ వీసీ ఆచార్య జీ జ్ఞానమణి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అకడమిక్ భవన నిర్మాణ పనులను సోమవారం వారిద్దరూ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ప్రిన్సిపాల్ జే నవీన లావణ్యలత, సీఈ నరసింహమూర్తి, ఈఈ రాయన్న, వివిధ విభాగాల సమన్వయకర్తలు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

మైలవరం: ఎమర్జింగ్ ట్రెండింగ్ టెక్నాలజీస్ మీద సరైన అవగాహన పెంచుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ రెన్యూవబుల్ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ టెక్నాలజీస్' అనే అంశంపై ఆన్‌లైన్ ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఐదు రోజుల పాటు ఈ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు. ఆరు రాష్ట్రాలకు చెందిన 49 కళాశాలల అధ్యాపకులు 150 మందికి ఈ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ శివవర ప్రసాద్ తెలిపారు. ఎన్ఐటీ గోవా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేష్ ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ ఎమర్జింగ్ ట్రెండింగ్ టెక్నాలజీస్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చే కొత్త ట్రెండ్స్‌ను తెలుసుకుని వాటి ద్వారా కెరియర్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే శివ వర ప్రసాద్, ఆర్.పద్మ, టి.హిమబిందు కో ఆర్డినేటర్స్‌గా వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, డీన్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

నందిగామ ప్రాంతంలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. రాత్రి 11:20 సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటసేపటివరకు భారీ వర్షం కురిసింది. వర్షం కురుస్తున్నంతసేపు ఉరుములు, మెరుపు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. మండలంలోని సోమవరం గ్రామంలో పిడుగుపడటంతో ఓ ఇంటి గోడ దెబ్బతింది. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్నాల తిరుపతిరావు, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మార్కెట్ సెంటర్, ఆంజనేయ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈనెల 1న ప్రారంభమైన వేడుకల్లో మూడోరోజు సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చన (ఆకు పూజ) జరిపారు. పట్టణానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తిరుపతిరావు ప్రత్యేక పూజలు..

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు హనుమాన్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి పళ్ల పలహారం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరావును శాలువాతో సత్కరించారు. స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో సోనికా ప్రతిభ



సోనికాను అభినందిస్తున్న ఎన్వీ.రావు, ఉపాధ్యాయులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఓపెన్ ఫైడ్ చెస్ టోర్నీలో రాణించిన రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని డి.సోనికా భవిష్యత్తులో మరిన్ని టోర్నీలలో రాణించి నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావు ఆకాంక్షించారు. కేఎల్ రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెస్ టోర్నీలో రాణించిన సోనికాను శాలువాతో సత్కరించి అభినందించారు. ఎన్వీ రావు మాట్లాడుతూ స్పార్క్ చెస్ అకాడమీ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ ఫైడ్ చెస్ టోర్నీలో సోనికా అద్భుత ప్రతిభను కనబర్చి మూడో స్థానంలో నిలిచిందన్నారు. రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న సోనికా గడిచిన మూడేళ్లలో 23 అవార్డులను సాధించడంతో పాటు 1445 పాయింట్లతో భారతదేశంలోనే ప్రముఖ చెస్ క్రీడాకారుల జాబితాలో చోటు సాధించిందన్నారు. భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని కోరుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు రమేష్, సాదికా, ప్రదీప్, జోజి, మెహరాజ్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి



చెక్కపల్లిలో పర్యటిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ముసునూరు: ప్రజలందరూ ఎన్నికల ఫలితాలు, విశ్లేషణలపై ఘర్షణ వాతావరణం లేకుండా చైతన్యం కలిగి, సంయమనంతో ఉండాలని ఎస్ఐ పి.వాసు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, రహదార్లు, సెంటర్లలో గుంపులుగా కనిపించిన వారికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఎన్నికల ఫలితాలపై ఘర్షణలు తలెత్తకుండా నివారించే విధంగా అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

10 మంది రౌడీషీటర్ల బైండోవర్

ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా పది మంది రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. గతంలో జరిగిన ఎన్నికల్లో వివాదాలు తలెత్తడానికి కారకులైన, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మంది రౌడీ షీటర్లను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఘర్షణల నివారణ కోసం మూడు రోజులు వారిని బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

ఆగిరిపల్లి: మండలంలో కౌంటింగ్ రోజున గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ సురేంద్ర కుమార్ హెచ్చరించారు. ఆగిరిపల్లిలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 విధించామన్నారు. గొడవలు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడే వారిని వదిలిపెట్టేది లేదన్నారు. గుంపులుగా ప్రజలు తిరగరాదని, కొట్లాటలు, అల్లర్లకు దిగితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి తండ్రి బిక్షాలరావుకు నగదు అందజేస్తున్న గ్రూపు సభ్యులు నాగరాజు, శ్రీధర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మూడు సంవత్సరాల చిన్నారి రాయబారపు శరత్ వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన రాయబారపు బిక్షాలరావు రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు చిన్నారి శరత్ క్యాన్సర్ వ్యాధి బారినపడటంతో దిక్కుతోచని పరిస్థితిలో కుమిలిపోయాడు. కొడుకు ట్రీట్‌మెంట్ కోసం తనకు చాతనైనంత వరకు ఖర్చు చేశాడు. చిన్నారి శరత్‌కు ప్రస్తుతం కిమోథెరపీ ద్వారా చికిత్స జరుగుతుంది. ఈ క్రమంలో ఆయన సాయం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుఫున చిన్నారి చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. గ్రూప్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్స్ జాజుల నాగరాజు, శ్రీధర్ సోమవారం తిరువూరులోని వారి ఇంటికి వెళ్లి నగదును అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఉడతాభక్తిగా సాయం అందచేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శకంగా లెక్కింపు చేపట్టాలి

సెంట్రల్ నియోజకవర్గ ఆర్ఓ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




భవానీపురం(విజయవాడపశ్చిమ):పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పక్కాగా లెక్కించాలని సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోని కొత్త భవనంలో ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ, రిహార్సల్స్ సెషన్ నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎన్నికల పరిశీలకుడు అభిషేక్ ధావన్ ఏర్పాట్లను తనిఖీ చేసి లెక్కింపు ప్రక్రియపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యున్నత ప్రమాణాలతో కచ్చితంగా, పారదర్శకంగా లెక్కింపు జరగాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సెంట్రల్ ఎమ్ఆర్ఓ రవీంద్రనాథ్ టాగూర్, నార్త్ ఎమ్ఆర్ఓ శంకర్ పాల్గొన్నారు.

చిల్లర అడిగినందుకు యువకుడిపై దాడి

ముసునూరు: చిల్లర అడిగినందుకు యువకుడిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రమణక్కపేటలో శనివారం రాత్రి రేమల్లె రాజు (24) స్థానిక వైన్ షాపు వద్ద ఉన్న దుకాణంలో రెండు డిస్పోజబుల్ గ్లాసులు, ఒక బఠాణీ ప్యాకెట్ కొనుగోలు చేసి, రూ.100 నోటు ఇచ్చాడు. తనకు రావాల్సిన చిల్లర కోసం అడిగాడు. ఈ సందర్భంలో వారి మధ్య వివాదం చెలరేగింది. చిన్న వివాదం కాస్తా పెద్దదైంది. ఈ నేపథ్యంలో స్థానికులైన ఆముదాల మల్లయ్య బాబు, వణుకూరి శ్రీను కలిసి రాజుపై కర్రలతో దాడి చేయగా, గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ శివనాగేంద్రరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీ భవానీ శంకర స్వామికి 108 కలశాలతో అభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మరకత పోలిన శ్రీ భవానీ శంకర స్వామికి సోమ వారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రీ భవానీ శంకర స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తయిన దృష్ట్యా విశేషంగా మండలాభిషేకం, 108 కలశాలతో పంచామృత అభిషేకం, రుద్రహోమం వేదపండితులతో శాస్త్రోక్తంగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు, దాత లక్ష్మణరెడ్డి పూజా కార్యక్రమాలలో పాల్గొని పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు అన్ని వ్యాపార సంస్థలు మూసివేయాలి

విస్సన్నపేట: విస్సన్నపేటలో అన్ని వ్యాపార సంస్థలు మంగళవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు మూసివేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుక్కడపు ప్రసాదరావు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున షాపులను తెరవవద్దని, షాపుల ముందు కూర్చోవద్దని నిబంధనలు పాటించాలన్నారు.